ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 23, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 13, క్యారెట్ 40, దొండ 45, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 37, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 38, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 8, మునగకాయ 10–12, ముల్లంగి 5–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి 83వ జయంతి సందర్భంగా డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి స్ఫూర్తి స్థల్‌ను సందర్శించారు. గురువారం జైపాల్‌రెడ్డి సమాధి వద్ద పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. అత్యుత్తమ పార్లమెంటియన్‌గా జైపాల్‌రెడ్డి దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసుకున్నారని కొనియాడారు. నేటి యువతరం ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

స్ఫూర్తి స్థల్‌లో..

సనత్‌నగర్: కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని గురువారం నెక్లెస్‌రోడ్డులోని స్ఫూర్తి స్థల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి పాల్గొని నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ఎస్.జైపాల్‌రెడ్డి చేసిన కృషిని ఈ సందర్భంగా చిన్నారెడ్డి గుర్తుచేశారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడే మేధావి జైపాల్‌రెడ్డి అని కొనియాడారు.

నేడు సంకటహర చతుర్థి

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని శ్రీగణపతి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ దర్శనం ఉంటాయన్నారు.

యాదవుల అభ్యున్నతికి కృషి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

చిలకలగూడ : యాదవుల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయనున్నట్లు తెలంగాణ యాదవ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాదం బాలరాజుయాదవ్ తెలిపారు. చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయంలో గురువారం ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యాదవులను సంఘటితం చేసి, అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన కేలండర్‌ను యాదవ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఆలయ చైర్మన్ గుంటి కృష్ణ, సభ్యులు దేవేందర్‌యాదవ్, జగన్, సంఘం ప్రతినిధులు మల్లేష్‌యాదవ్, మధుయాదవ్, సత్యనారాయణ, నాగరాజ్, సిద్ధు, శ్రీనివాస్, శ్రీశైలంయాదవ్, చందు, రాజు తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించేందుకు ప్రత్యేక వాహనం



వాహనంతో చెత్తను తొలగిస్తున్న వాహనం

ఖైరతాబాద్: చెత్తను తొలగించేందుకు జటాయు గార్బేజ్ పికప్ ప్రత్యేక వాహనంతో చెత్తను తొలగించే డెమో కార్యక్రమాన్ని ఖైరతాబాద్ డివిజన్‌లో గురువారం నిర్వహించారు. లా మెట్రిక్ కంపెనీకి చెందిన జటాయు గార్బేజ్ పికప్ వాహనం ఒకేసారి ట్యాంక్‌లోకి పెద్దమొత్తంలో చెత్తను పైప్‌గొట్టం ద్వారా నేరుగా ట్యాంక్‌లోకి పీలుస్తుంది. ఈ వాహనం డెమోను ఖైరతాబాద్ డివిజన్‌లో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, మెట్రిన్ కంపెనీ ప్రతినిధి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ శిక్షణ..ఉపాధికి మార్గం

- సీతాఫల్‌మండి కేంద్రంలో 9 కోర్సులు
- అత్యుత్తమ శిక్షణతో ఉపాధి అవకాశాలు
- యువత, మహిళలకు బాసట

సత్ఫలితాలు సాధిస్తున్న సెట్విన్



సీతాఫల్‌మండిలోని సెట్విన్ శిక్షణ సంస్థ భవనం

సికింద్రాబాద్: యువతీయువకులు, మహిళలకు వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణను ఇవ్వడం, ఉపాధి అవకాశాలు చూపించడంలో సీతాఫల్‌మండిలోని సెట్విన్ శిక్షణ సంస్థ సత్ఫలితాలను రాబడుతోంది. ముఖ్యంగా ఇంటి పట్టున ఉండే మహిళలకు ఉపయుక్తంగా ఉండే శిక్షణలు ఇవ్వడంలో సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

మహిళలకు స్వావలంబన..

ఇక్కడ శిక్షణ పొందిన మహిళలు ఇంటివద్దే వృత్తి వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటున్న వారు ఆర్థిక స్వావలంబన పొందుతున్నారు. నాలుగేళ్ల క్రితం 6 కోర్సులతో సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మొదటి అంతస్తులో సెట్విన్ సంస్థ శిక్షణలు కొనసాగుతున్నాయి.

- పాతబస్తీలోని సెట్విన్ శిక్షణ కేంద్రంలో 45 కోర్సుల్లో శిక్షణలు అందుబాటులో ఉన్నాయి. ఇదే తరహాలో సీతాఫల్‌మండి శిక్షణ కేంద్రాన్ని తీర్చిదిద్దేందుకు కార్యాచరణ సిద్ధమైంది.

ప్రస్తుతం 8 గదుల్లో శిక్షణ..

ప్రస్తుతం 8 గదుల్లో శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. మరో అంతస్తు నిర్మాణ పనులు పూర్తిచేసిన అనంతరం అధునాతన కోర్సుల్లో శిక్షణ ప్రారంభిస్తామని సెట్విన్ అధికారులు చెబుతున్నారు.

జాబ్‌మేళాల ఏర్పాటుతో...

పదోతరగతి మొదలు పీజీ వరకు చదివిన అభ్యర్థులకు సెట్విన్ శిక్షణలు అందుబాటులో ఉన్నాయి. రూ.3 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన సెట్విన్ శిక్షణ కేంద్రం సికింద్రాబాద్ ప్రాంత మహిళలు, యువతీయువకుల ఉపాధికి బాసటగా నిలుస్తుండటం గమనార్హం.

- ఒక్కో బ్యాచ్‌కు 300 మంది అభ్యర్థుల చొప్పున శిక్షణనిచ్చేందుకు సీతాఫల్‌మండి సెంటర్‌లో వసతులు అందుబాటులో ఉన్నాయి. మొత్తంగా ఏటా వేయిమంది అభ్యర్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు.
- ప్రైవేట్ విద్యాసంస్థల్లో పెద్ద మొత్తం ఖర్చుతో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సును ఇక్కడ నామమాత్రపు ఫీజుతోనే అందుబాటులో ఉంచారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేయడంతో పాటు ఏటా జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు.
- సెట్విన్ సంస్థ నగరంలోని 20 కేంద్రాల్లో శిక్షణ తరగతులను ఏర్పాటు చేసింది. వీటన్నింటిలో పాతబస్తీ మోతీగల్లీ కేంద్రంలో ఎక్కువ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.

రెండో అతిపెద్ద శిక్షణ కేంద్రం..

కొన్నేళ్ల క్రితం నెలకొల్పిన సీతాఫల్ మండి శిక్షణ కేంద్రం వసతులు, కోర్సుల పరంగా రెండో అతిపెద్ద శిక్షణ కేంద్రంగా అవతరించింది.

అన్ని రకాల కోర్సులు..

విద్యార్హత, ఆసక్తి ప్రాతిపదికన వివిధ కంప్యూటర్ కోర్సులతో పాటు హోటల్ మేనేజ్‌మెంట్, టైలరింగ్, బ్యూటీషియన్, మొబైల్ రిపేర్, సీసీ కెమెరా ఇన్‌స్టాల్ కమ్ సర్వీస్ కోర్సుల్లో ఇక్కడ శిక్షణలు కొనసాగుతున్నాయి. దీనికోసం 20 మంది సుశిక్షితులైన ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు.



శిక్షణ పొందుతున్న యువత

- కోర్సుల తీరును బట్టి మూడు నుంచి 12 నెలల డిప్లొమా కోర్సులను సీతాఫల్‌మండి శిక్షణ కేంద్రంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. నామమాత్రపు ఫీజులతో అత్యాధునిక సాంకేతికతతో కూడిన శిక్షణలు ఇస్తుండడం ఇక్కడి ప్రత్యేకత. నామమాత్రపు ఫీజులను సైతం వాయిదా పద్ధతుల్లో చెల్లించుకునేందుకు వెసులుబాటు కల్పిస్తున్నారు.

ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం కృషి



సీతాఫల్‌మండిలో శిక్షణల ద్వారా సత్ఫలితాలు సాధించాం. శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాల కోసం జాబ్‌మేళాలు ఏర్పాటు చేస్తున్నాం. వృత్తి విద్యాకోర్సులు పూర్తి చేసిన వారికి బ్యాంకు రుణాలు అందించేందుకు కూడా సహకరిస్తాం. అభ్యర్థులు సీతాఫల్‌మండి శిక్షణ కేంద్రంలో నేరుగా సంప్రదించాలి.

– వేణుగోపాల్‌రావు, సెట్విన్ ఎండీ

పేదల అభ్యున్నతి కోసమే ఏర్పాటు



సికింద్రాబాద్ నియోజకవర్గం మొత్తంగా పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతం. ఇక్కడి మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు చూపించేందుకు ఇక్కడ సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయించాం. ప్రత్యేక నిధులు ప్రభుత్వం నుంచి ఇప్పించి అధునాతన భవనాన్ని నిర్మించాం. మరిన్ని కోర్సులు, వసతుల కోసం అదనపు అంతస్తు నిర్మాణాన్ని చేపట్టాం. సీతాఫల్‌మండి సెట్విన్ కేంద్రాన్ని నగరంలో అత్యున్నత శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దుతాం.

– టీ.పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చిలకలగూడ : గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ శరత్ తెలిపిన వివరాల ప్రకారం.. ముషీరాబాద్ క్రాస్‌రోడ్స్‌లోని రామాలయం సమీపంలో ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు డయల్100కు సమాచారం అందింది. గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. సంబంధీకులు 040–27853597 నంబరుకు సమాచారం అందించాలన్నారు.

మెకానిక్‌ల సమస్యలు పరిష్కరిస్తా



ఎంపీ ఈటలతో మెకానిక్ అసోసియేషన్ సభ్యులు

మల్కాజిగిరి: టూవీలర్ మెకానిక్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హెచ్‌ఎంఆర్ టూవీలర్స్ మెకానిక్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి సమస్యలను తెలియజేశారు. అనంతరం నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌యాదవ్, కోశాధికారి మహిపాల్‌రెడ్డి, శివ, ఉమామహేశ్వరరావు, సుధాకర్, లింగం, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

మహా ప్రదర్శనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న దరువు అంజయ్య

రసూల్‌పురా: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఫిబ్రవరి 7న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించే లక్ష డప్పులు, వేల గొంతుల మహా ప్రదర్శనకు బీసీ కవులు, కళాకారుల, రచయితలు పాల్గొని విజయవంతం చేయాలని బీసీ కవుల రచయితల ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ దరువు అంజయ్య తెలిపారు. గురువారం డ్రీమ్ ల్యాండ్ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి దరువు అంజయ్య హాజరై మాట్లాడారు. 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్ని అడ్డంకులు వచ్చినా వెనకడుగు వేయకుండా అనేక ఉద్యమాలు చేశారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ ప్రజాస్వామిక హక్కు అన్నారు. ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్ మోహన్ బైరాగి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు సైతం వర్గీకరణ చేయాలని కోరిందని కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అధికారికంగా అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇటిక శ్రీకిషన్ మాదిగ, డప్పు మల్లికార్జున్ మాదిగ, అజిత్ కల్యాణ్ వాల్మీకి పాల్గొన్నారు.

పోలీసుల చేయూత



మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో ఔట్‌సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న యాదమ్మకు పోలీసులు చేయూతను అందించారు. ఈనెల 6న పోలీస్‌స్టేషన్ సమీపంలోనే గత కొన్నేళ్లుగా పానిపూరి బండి నిర్వహిస్తున్న యాదమ్మ భర్త ఆంజనేయులు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఆమె కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో పోలీస్‌స్టేషన్‌లో అందరూ కలిసి రూ.1,0,6000లను ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డీఐ శ్రీశైలం, ఎస్సై సునీల్‌కుమార్‌లు ఆమెకు అందజేశారు.

రేపు డీడీసీవోపీ గ్రాడ్యుయేషన్ డే

నల్లకుంట: నల్లకుంటలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ(డీడీసీవోపీ) గ్రాడ్యుయేషన్ డే ఈనెల 18న నిర్వహించేందుకు అని ఏర్పాట్లు చేశామని డీడీసీవోపీ ప్రిన్సిపాల్ ఛాయ నందిని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యానగర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న డీడీహెచ్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆడిటోరియంలో ఉదయం 11గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. పాట్నా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పట్టాలు అందజేసి ప్రసంగిస్తారని తెలిపారు. ఆతిథ్య అతిథిగా డీడీఎంఎస్ ప్రెసిడెంట్ ఉషాకంద హాజరవుతారన్నారు.

ట్యూషన్ ఫీజు బకాయిల చెల్లింపు చివరి తేదీ 25

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ, పీజీ ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు ట్యూషన్ ఫీజు బకాయిలు చెల్లించడానికి చివరి తేదీ జనవరి 25 అని విద్యార్థి సేవల విభాగాధిపతి డాక్టర్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఇప్పటికే అడ్మిషన్ పొంది ఉండి సకాలంలో ఫీజు చెల్లించలేకపోయిన వారు జనవరి 25వ తేదీలలోపు ట్యూషన్ ఫీజు బకాయిలను ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలన్నారు. విశ్వవిద్యాలయ హెల్ప్‌డెస్క్ నెంబర్లు 040–23680222/333/444/555 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

31వ గ్లోబల్ పీస్ అండ్ ఎక్సలెన్సీ అవార్డులు

లిబర్టీ: వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి గ్లోబల్ పీస్ అండ్ ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ వెల్లడించారు. వివిధ రంగాల్లో అత్యంత ప్రతిభాపాటవాలు కనబరుస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్సలెన్స్ అవార్డు –2015 పేరిట ఈ నెల 31వ తేదీన 6.30 గంటలకు గోవా విలేజ్ రిసార్ట్స్‌లో అవార్డుల ప్రదాన ఉత్సవం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్య, వైద్యం, సాంస్కృతిక శాంతి సామరస్యం, మత సామరస్యం, సామాజిక సేవ వంటి అనేక రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేశారు.

ముగిసిన మల్లన్నస్వామి బ్రహ్మోత్సవాలు



మల్లన్నస్వామికి బోనాలు తీసుకొస్తున్న ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఊర్మిళ కుటుంబ సభ్యులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ బాకారంలో ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి(మల్లన్న) బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. అశోక్‌నగర్‌కు చెందిన స్వామివారి భక్తుడు ఆర్.రాజనర్సింగ్ రావు, ఉమామహేశ్వరి దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అంతకుముందు ఊరేగింపుగా బోనాలు తీసుకువచ్చి మల్లన్నస్వామికి నైవేద్యంగా సమర్పించారు. రాత్రి నిర్వహించిన అగ్ని గుండంలో నడిచే కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఊరిమ్మళ, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, హారిక, యాదగిరి, సురేష్, రామానందరెడ్డి, రాజు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

బీఆర్‌ఎస్ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు



ముషీరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ కక్షసాధింపు చర్యలు మానుకొని పాలనపై దృష్టి సారించాలని గురువారం బీఆర్‌ఎస్ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాస్‌రావు అన్నారు. అధికారంలోకి వచ్చి 13 నెలలు అవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకునే పరిస్థితి లేదని విమర్శించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేశారని అన్నారు. బీఆర్‌ఎస్‌కు ఉన్న పేరును చెరిపేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ కేడర్‌ను భయభ్రాంతులకు గురిచేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రశ్నించే వారి అరెస్టులు చేస్తూ ప్రభుత్వం పబ్బం గడుపుకోవాలని చూస్తోందని ఆరోపించారు. దమ్ముంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సవాలు విసిరారు.

ఊడితే మూడినట్టే



సికింద్రాబాద్ బోయిగూడ ఫ్లోరా హోటల్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి కింద ఇనుప రేకు ప్రమాదకరంగా మారింది. నిత్యం వేలాది మంది ఈ బ్రిడ్జి కింది నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే స్టేషన్, మోండా మార్కెట్‌కు వెళ్లాలంటే ఈ బ్రిడ్జి కింది నుంచే వెళ్లాల్సి వస్తోంది. ఇనుప రేకు తగిలి ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురువతున్నారు. ఈ బ్రిడ్జి కింది నుంచి రాకపోకలు సాగిస్తున్న ట్రాలీ ఆటోలు, ఇతరత్రా గూడ్స్ వాహనాలకు రేకు తగులుతోంది. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన రేకును తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

–బన్సీలాల్‌పేట్

హెల్మెట్‌దారులకు ప్రశంస

గులాబీతో పోలీసుల అభినందన



గులాబీలు అందిస్తున్న ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

చిలకలగూడ : హెల్మెట్ ధరించిన వాహనదారులకు చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు గులాబీపూలతో స్వాగతం పలికి సత్కరించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఠాణా పరిధిలోని ఆలుగడ్డబావి వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని హెల్మెట్ ధరించిన వాహనచోదకులకు గులాబీపూలు అందించి అభినందించారు. హెల్మెట్ ధరించని బైక్ రైడర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. మన రాక కోసం ఇంటి వద్ద కుటుంబసభ్యులు ఎదురుచూస్తుంటారని, ప్రతి ఒక్క వాహన చోదకుడు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. మన ప్రాణాలకు రక్షణ కవచంగా హెల్మెట్ ఉపయోగపడుతుందని, ప్రమాదాలు జరిగిన సమయంలో హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయన్నారు. చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాసులు, పలువురు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కథనం ప్రచురితం.. కదిలిన యంత్రాంగం

రోడ్డుపై తవ్విన గుంత పూడ్చివేత





సాక్షి ఎఫెక్ట్..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, 31 బస్టాప్ సమీపంలో రోడ్డుపై స్థానిక హోటల్ నిర్వాహకుడు డ్రైనేజీ లైన్ కోసం భారీ గుంతను తవ్వి వదిలేశాడు. అయితే అనుమతులు తీసుకోవాల్సి ఉండగా ఎలాంటి అనుమతులు లేకుండా స్థానిక పోలీసుల సహకారంతో గుంతను తవ్వినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. నిత్యం ఇక్కడ రద్దీగా ఉండే ప్రాంతంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. ఈ సమస్యపై గత నెల 29న 'అంతా మా ఇష్టం' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. గుంత చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించి గుంతను పూడ్చారు. సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిన సాక్షికి వాహనదారులు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

–బన్సీలాల్‌పేట్

రోడ్డు భద్రత అందరి బాధ్యత



హెల్మెట్ ధరించిన ద్విచక్రవాహనాదారులను అభినందిస్తున్న ఏసీపీ శంకర్ రాజు


రసూల్‌పురా: ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న వారు సైతం హెల్మెట్ ధరించాలని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం తిరుమలగిరి ట్రాఫిక్ సీఐ మధుబాబు, ఎస్‌ఐ శ్రీకాంత్, సిబ్బందితో కలిసి తిరుమలగిరి చౌరస్తాలో రోడ్డు భద్రతా నియమాలు, హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించకపోవడంతో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు గులాబీ పువ్వులిచ్చి ప్రశంసించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

మైత్రివనం చౌరస్తాలో..


అమీర్‌పేట: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవడంతో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడొచ్చని ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మైత్రివనం చౌరస్తాలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బైక్ నడిపేవారితోపాటు వెనకల కూర్చుని హెల్మెట్లు పెట్టుకున్న వారిని అభినందించారు.

గాస్ మండి చౌరస్తాల్లో ..

బన్సీలాల్‌పేట్: రాణిగంజ్, కర్బలామైదాన్, ఆర్పీ రోడ్డు, గాస్ మండి చౌరస్తాల్లో గురువారం మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు పడుపుతున్న పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రత జాగ్రత్తలు తీసుకుంటేనే మనం సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకుంటామన్నారు.



హెల్మెట్లు ధరించి వెళ్తున్న వారికి గులాబీలు ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్